క్లుప్తంగా

నర్సిపల్లిలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురం పంచాయతీ నర్సిపల్లి మెట్టవద్ద బొద్దాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 30 మందికి వైద్య సిబ్బంది వివిధ పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కాచిన నీటిని తాగాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ అరుణ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త స్వప్నకుమార్, హెల్త్ అసిస్టెంట్ శేఖర్, ఆశ కార్యకర్త వసంత పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది

గంట్యాడ: గర్భిణులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ పీఓ డోకుల ఉమా భారతి సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా గొడియాడ గ్రామంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్న ప్రాసన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజూ ఆహారంలో కూరగాయలు, పప్పు దినుసులు, పండ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి ,అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

గుర్ల: ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎరువుల దుకాణాల యజమానులను ఏఓ ఎం.తిరుపతిరావు హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తుండడంతో మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం ఆయన తనిఖీలు చేశారు. రికార్డులతో పాటు ఎరువుల నిల్వలను పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

భూపట్టాలు మంజూరు చేయాలని వినతి



తహసీల్దార్ అజూ రఫీజాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మెరకముడిదాం: ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని గరివిడి మండలం నీలాద్రిపురం రైతులు తహసీల్దార్ అజూ రఫీజాన్‌ను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆ గ్రామానికి చెందిన 45 మంది రైతులు సోమవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ మెరకముడిదాం మండలంలోని ఇప్పలవలస రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 215లో 22.92 ఎకరాల భూమిని ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని అన్నారు. ఈభూమిని తమకు తెలయకుండా అధికారులు వేరే వారి పేరుమీద రిజిస్ట్రేషన్ చేశారని, దీనిని రద్దు చేసి తమకు హక్కు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేయాలని అభ్యర్థించారు. నీలాద్రిపురం మాజీ సర్పంచ్ అలమండ అప్పలనాయుడు, మజ్జి రాజినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలపై పరిశీలన

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా భూగర్భ, గనులశాఖ అధికారి బి.విజయలక్ష్మి సోమవారం పరిశీలించారు. సర్వే నంబర్ 239/5లో ఎలాంటి అక్రమ తవ్వకాలు జరగలేదని తేల్చారు. ఈ ప్రాంతంలో డీ పట్టా భూమిలో డీ పట్టాదారుల అంగీకారం మేరకు మట్టి దిబ్బలను కోళ్లఫారానికి తరలించినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో గరివిడి రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు గ్రామ సమీపంలోని మామిడితోటలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్‌ఐ గోపాలరావు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడి చేశారు.పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.24,200 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చెరగని ముద్ర వైఎస్సార్



తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో–ఆర్డినేటర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లో వాడవాడలా వైఎస్సార్ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ రాజన్నా అంటూ నినాదాలు చేశారు. గరివిడి, గుర్లలో వైఎస్సార్ విగ్రహాలకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎస్.కోట, కొత్తవలసలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పూలమాలలు వేశారు. ఎస్.కోట ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



గజపతినగరం: గజపతినగరంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మండల నాయకులు



వేపాడ: వేపాడలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మండల నాయకులు



గంట్యాడ: కొటారుబిల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ నరసింహమూర్తి, జైహింద్‌కుమార్



దత్తిరాజేరు: ఆర్.రామచంద్రాపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు,నాయకులు



చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



శృంగవరపుకోట: ఎస్.కోట దేవీ జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్ రాజన్న అంటూ నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నాయకులు



బొండపల్లి: బొండపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎంపీపీ చల్లంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు, నాయకులు



చీపురుపల్లి రూరల్(గరివిడి): కాపుశంభాంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



గుర్ల: కెల్ల జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



కొత్తవలస: కొత్తవలస జంక్షన్‌లో రాజన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,నాయకులు



జామి: జామిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సరయు,ఎంపీపీ అరుణ, రవికుమార్,తదితరులు



గజపతినగరం రూరల్: గంగచోళ్లపెంటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



జామి: జాగరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



గంట్యాడ: లక్కిడాంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సంక్షేమానికి చిరునామా వైఎస్సార్



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- వైఎస్సార్ విగ్రహావిష్కరణలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: సంక్షేమానికి చిరునామా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో–ఆర్డినేటర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు.మండల కేంద్రంలో జెడ్పీ చైర్మన్ తనసొంత నిధులు రూ.1.10లక్షలతో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ప్రప్రథమంగా పారదర్శకంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు చేరువచేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. పేదలకు విద్య, వైద్యం సక్రమంగా అందినప్పుడే వారు ఆత్మస్థైర్యంతో ఎదుగుతారనే ఆశయంతో ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలు తీసుకొచ్చారని, బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు జలయజ్ఞం పథకంపేరిట సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారని, రైతులకు రుణమాఫీ చేశారని, 108, 104, వంటి ఎన్నో పథకాలు అమలు చేసి పేదల పెన్నిధిగా మారారని గుర్తు చేశారు. అనంతరం వందమంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె,.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, గుర్ల మండల నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, పప్పల కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు టి.హరిబాబు, కందుల మల్లికార్జునరావు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లక్ష్య ఫౌండేషన్ ప్రతినిధులు

శృంగవరపుకోట: స్థానిక లక్ష్య ఫౌండేషన్ గురుపూజోత్సవం నేపథ్యంలో నియోజకవర్గస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. వారిని పట్టణంలోని ధారగంగమ్మ కల్యాణ మండపంలో అతిథులు డైట్ ప్రిన్సిపాల్ ఎస్.తిరుపతినాయుడు, సీఎంఓ వి.ఆదినారాయణ, డీసీఈబీ సెక్రటరీ టి.సన్యాసిరాజు, పెదఖండేపల్లి హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు సోమవారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపికైన వారిలో సీహెచ్.పద్మావతి(కుమరాం), ఏ.చక్రధారి(కొట్యాడ), వి.వెంకటరావు(గొల్జాం), కె.శ్రీనివాసరావు(సోంపురం), వి.ఎరుకునాయుడు(వి.ఆర్.పేట), ఎస్.కవి(చందులూరు), బి.జయ(ధర్మవరం), కె.ఈశ్వరరావు(జామి), ఎస్.గోపి(కొట్టాం) బి.వెంకటరావు(మల్లివీడు), కె.కృష్ణకుమారి(కొత్తవలస), ఎం.సతీష్(పాటూరు), పి.ఎస్.వి.శాస్త్రి(సీతానగరం), పాదం సతీష్(చామలాపల్లి) తదితరులు ఉన్నారు. ఆయా పాఠశాలల విద్యార్థుల నుంచి తీసుకున్న అభిప్రాయాల ఆధారంగా ఉపాధ్యాయులను ఎంపిక చేశామని లక్ష్య ఫౌండేషన్ నిర్వాహకులు కర్రి పవిత్రలహరి, మండ సత్యసాహితి, ఏడువాక గాయత్రి, జామి వెంకటరమణ, వై.భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.ఈశ్వరరావు, సీహెచ్.శర్మ, ఆజ్జాడ నరేష్, రహీం షేక్‌లాల్, జి.రవి, భాస్కరరావు, జి.వెంకటరావు, జి.అవతారం, జి.గోవిందరావు, ఏ.రవి, సత్యారావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

• పొంగి పొర్లుతున్న చెరువు



కిత్తన్న కట్టు చెరువు చప్టాపై నుంచి పారుతున్న నీరు

లక్కవరపుకోట: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మండల కేంద్రానికి చెందిన కిత్తన్నకట్టు చెరువు పూర్తి స్థాయి లో నీటితో నిండింది. మిగులు నీరు చప్టాపై నుంచి పారుతోంది.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



గోవింద్ మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని చౌదంతివలస కూడలి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన సారికి గోవింద్(55) మృతి చెందారని ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్ సోమవారం తెలిపారు. ఈ ప్రమాదంపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణాపురం గ్రామానికి చెందిన గోవింద్ రామభద్రపురం మండలంలోని ఆరికతోట నుంచి స్వగ్రామానికి ఆదివారం రాత్రి టీవీఎస్ ఎక్సెల్ బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, ఆంధ్ర, బొబ్బిలి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌లను చోరీ చేసిన బృందంలోని చీపురుపల్లి మండలం పేరిపి గ్రామానికి చెందిన ఎలక గణేష్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నిందితుడి నుంచి రూ.1.50 లక్షల విలువైన రాగి, అల్యూమినియం దిమ్మలను రికవరీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లిమర్ల మండలం కొండవెలగాడ, కొత్తపేట, గుషిణి, పారసం, చంద్రంపేట గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు ఎలక్ట్రికల్ డిపార్ట్ మెంట్ వారు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు చోరీలకు గురయ్యాయి. అదేవిధంగా పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి,ఆంధ్ర,బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇదే తరహా నేరాలు జరిగాయి. దీంతో ఇటువంటి నేరాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించడంతో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీసీఎస్ సీఐ ఎ.సత్యనారాయణ, భోగాపురం సీఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది ఒక బృందంగా ఏర్పడ్డారు. ఈ క్రమంలో సీసీఎస్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు నెల్లిమర్ల ఎస్సై ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం ఉదయం మిమ్స్ ఆస్పత్రి సమీపంలో వాహన తనిఖీలు చేపడతుండగా.. గుర్ల వైపు నుంచి విజయనగరం వైపు వస్తున్న ఒక ఆటోలో వెనుకన కూర్చొన్న ఒక వ్యక్తి పోలీసులను చూసి ఒక మూటతో పారిపోతుండగా... పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారించగా..తన పేరు గణేష్ అని, చీపురుపల్లి మండలం పేరిపి గ్రామమని.. తన బంధువులైన పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన సారికి దుర్గారావు, సారికి సురేష్, ముంగిన అజిత్ కుమార్‌తో కలిసి ట్రాన్స్‌ఫార్మర్లు దొంగిలిస్తుంటానని పోలీసులకు చెప్పాడు. నెల్లిమర్ల, పూసపాటిరేగ, డెంకాడ, చీపురుపల్లి, ఆంధ్ర, బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశామని.. దొంగలించిన రాగి, అల్యూమినియం వైరులను వారు కొవ్వూరు తీసుకుని వెళ్లిపోయి.. తన వాటాగా 10 రాగి, రెండు అల్యూమినియం దిమ్మలు ఇచ్చారన్నారు. నిందితుడి నుంచి లక్షన్నర రూపాయల విలువైన రాగి, అల్యూమినియం దిమ్మలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో క్రియాశీలకంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ ఎ.సత్యనారాయణ, భోగాపురం సీఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్సై రామగణేష్, సీసీఎస్ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఎరువుల కొరత రాకుండా చూడండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- డీఏపీ లభించడం లేదని రైతులు తమ దృష్టికి తీసుకువస్తున్నారు
- అధికారులు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నియోజకవర్గంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవకపోవడంతో బోరుబావులు ఉన్న రైతులే వరినాట్లు వేశారని చెప్పారు. తక్కువ విస్తీర్ణంలో వరి నాట్లు వేసినప్పటికీ, ఆ రైతులకు కూడా ప్రభుత్వం సరిపడా ఎరువులు అందించలేకపోతుండడం బాధాకరమని అన్నారు. డీఏపీ ఎరువు లభించడం లేదని నియోజకవర్గంలోని పలు గ్రామాల రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. పంటకు సకాలంలో ఎరువులు అందించకపోతే తమ శ్రమ, పెట్టుబడి వృథా అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏనాడూ ఎరువులు, విత్తనాల కొరత రాలేదని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు అందించే వారమని గుర్తు చేశారు.కూటమి ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులు కూడా సరఫరా చేయలేని స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు.అధికారులు తక్షణమే స్పందించి రైతులకు డీఏపీ ఎరువు అందేలా చూడాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సీనియర్ నాయకుడు నారాయణమూర్తిరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, తుమికాపల్లి,మధుపాడ గ్రామ సర్పంచ్‌లు బెల్లాన త్రినాథరావు, కడుపుట్ల పైడిపునాయుడు, పురిటిపెంట వైస్ సర్పంచ్ మండల సురేష్, నాయకులు రేగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

108 శివలింగాలకు రుద్రాభిషేకం



కొత్తవలస: ఓం సదనం ఆశ్రమంలో 108 శివలింగాలకు రుద్రాభిషేకం చేస్తున్న రుత్వికులు



లక్కవరపుకోట: ఎల్.కోటలోని వీరభద్రస్వామి ఆలయంలో భక్తులతో అభిషేకం చేయిస్తున్న అర్చకులు

కొత్తవలస: మాస శివరాత్రి సందర్భంగా మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలోని ఓం సదనం ఆశ్రమంలో సోమవారం అర్చకులు 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరభద్రస్వామి ఆలయంలో...

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయంలో అర్చకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులతో శివలింగానికి అభిషేకాలు చేయించారు.

నేత్రదానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

బొండపల్లి: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యసిబ్బంది నేత్రదానంపై మండల కేంద్రంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మరణానంతరం నేత్రాలు మట్టిలో కలిసిపోకుండా దానం చేస్తే, అంధులకు చూపు ప్రసాదించే వారవుతారని, అపోహలు వీడి నేత్ర దానం చేయాలని సూచించారు. అనంతరం నేత్ర దాన పక్షోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆప్తాలమిక్ అధికారి కె.శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.ఎ.బాషా తదితరులు పాల్గొన్నారు.

సహాయ స్ఫూర్తి ఫౌండేషన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్

గజపతినగరం: స్థానిక సహాయ స్ఫూర్తి ఫౌండేషన్‌కు బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు లభించింది. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆత్మకూరు శంకరరావు జయంతి సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పలు సంస్థలకు విశాఖలో సోమవారం అవార్డులు అందజేశారు. ఆగస్టు 2023 నుంచి 2024 వరకు గజపతినగరం, మెంటాడ, మెరకముడిదాం మండలాల్లో రక్తదాన ,నేత్రదాన శిబిరాల నిర్వహణ, 359 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు చేయించినందుకు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్‌కు అవార్డు ప్రధానం చేశారు. శంకర్ ఫౌండేషన్ జీఎం రాధాకృష్ణ చేతులు మీదుగా సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, సాయిరేవంత్ అవార్డు అందుకున్నారు.